సాక్షి జగిత్యాల

మంగళవారం। 30। ఏప్రిల్। 2024



శివపార్వతుల కల్యాణం

ధర్మపురి: మండలంలోని జైనాలో శివపార్వతుల కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు.



ఎల్లమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే

మల్లాపూర్: చిట్టాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
44.0/30.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండవేడిమి పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు తీవ్రంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని చల్‌గల్ మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. కేంద్రానికి రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేయాలని సూచించారు. వివరాలను ట్యాబ్‌లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, రైతుల ఖాతాలో డబ్బులు జమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట డీటీసీఎస్ వరప్రసాద్, ఏఈవో నాగరాజు, సింగిల్ విండో కార్యదర్శి గాజంగి వేణు, సెంటర్ ఇన్‌చార్జిలు నవీన్, అజయ్, సాయిరాం, మధు పాల్గొన్నారు.

మగ్గిడి ఎడపెల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వాణి

ధర్మపురి: మండలంలోని మగ్గిడిఎడపెల్లిలో సోమవారం పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఏర్పాటు చేశారు. ప్రారంభకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వాణి హాజయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్ర కీలకమన్నారు. పొలాస వ్యవసాయ విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను రైతులకు వివరిస్తారని తెలిపారు. అలాగే పరిశుభ్రత పచ్చదనం, మరుగుదొడ్ల ఆవశ్యకత, బహిరంగ మల విసర్జన నిర్మూలన, పశువులకు వ్యాపించే వ్యాధులు, నివారణ వంటి అంశాలను వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ భారతినారేన్ భట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎల్లాగౌడ్, రత్నాకర్ సుష్మాదేవి, విద్యార్థి ప్రతినిధి ముత్యం తిరుపతి తదితరులున్నారు.

సౌకర్యాలు కల్పించకుంటే ఓట్లేయం



నిరసన తెలుపుతున్న నూకపెల్లి డబుల్ లబ్ధిదారులు

జగిత్యాలటౌన్: డబుల్ ఇళ్ల వద్ద వసతులు కల్పించాలని, అప్పటివరకు ఓటేసేదిలేదని నూకపెల్లి డబుల్ ఇళ్ల లబ్ధిదారులు తేల్చి చెప్పారు. ఇళ్లు లేని తమకు డబుల్ ఇళ్లు పంపిణీ చేసిన గత ప్రభుత్వం కనీస సౌకర్యాలైన విద్యుత్, తాగునీరు, మురుగుకాల్వలు నిర్మాణం వంటి వసతులు కల్పించలేదని, దీంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని జగిత్యాల అర్బన్ మండలం నూకపెల్లి అర్బన్ కాలనీ డబుల్ ఇళ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్3న పట్టాలు పంపిణీ చేసిన అధికారులు.. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఇళ్లు కేటాయించారని, వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. ఇటీవల ప్రారంభించిన మురుగునీటి కాలువల నిర్మాణం కూడా మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. వారంరోజుల్లో వసతులు కల్పించే వారికే పార్లమెంట్ ఎన్నికల్లో తమ నాలుగు వేల కుటుంబాల సభ్యులు ఓట్లు వేస్తామని, లేకుంటే వేయబోమని తేల్చి చెప్పారు.

116 మంది సూక్ష్మపరిశీలకులు

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో 116మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ సాధారణ పరిశీలకులు రవీష్‌గుప్తా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ దివాకర, ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, ఎల్డీఎం వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య తదితరులున్నారు. ఎంపీ ఎన్నికలను సమర్థవంతగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి దివాకర అధికారులకు సూచించారు. స్థానిక గిరిజన వసతి గృహంలో సెక్టార్ అధికారులకు అవగాహ న కల్పించారు. ఈవీ ఎంల కమీషనింగ్ ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానాన్ని పరిశీలించారు. ఎస్‌వోలకు శిక్షణ ఇచ్చారు. అంతకుముందు కోటిలింగాల కోటేశ్వరస్వామిని రవీష్‌గుప్తా, దివాకర దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎండ @ 45 డిగ్రీస్



జనసంచారం లేని తహసీల్ చౌరస్తా, ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని టవర్‌సర్కిల్ వద్ద పరిస్థితి, నిర్మానుష్యంగా పాతబస్టాండ్

జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. వెల్గటూర్ మండలంలోని 45డిగ్రీలు దాటి ఉష్ణోగ్రత నమోదైంది. రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.7, నేరెళ్లలో 44.6, ఇబ్రహీంపట్నం గోధూరులో 44.5, ధర్మపురి మండలం జైనలో 44.4, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 44.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఉదయం తొమ్మిది గంటలు దాటిందంటే చాలు ప్రజలు ఎవరూ బయటకు రావడం లేదు. వెల్గటూర్ ప్రాంతం అధికంగా గుట్టలతోపాటు ఎక్కువగా క్రషర్లు ఉండడం.. పచ్చదనం పంచే చెట్లు లేకపోవడంతో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు సమాచారం – జగిత్యాల

బరిలో 29 మంది అభ్యర్థులు

- నామినేషన్లు ఉపసంహరించుకున్న ముగ్గురు
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

సుభాష్‌నగర్(నిజామాబాద్): నామినేషన్ల ఉపసంహరణకు గడువు సోమవారంతో ముగిసింది. నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మొత్తంగా 42 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. స్క్రూటినీలో 10 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో బరిలో 29 మంది నిలిచారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా ముత్యం రఘు, పోతు నాగార్జున్, పోతు రవి తమ నామినేషన్లను వాపస్ తీసుకున్నారని తెలిపారు.

బరిలో నిలిచిన అభ్యర్థులు వీరే..

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచిన 29 మంది అభ్యర్థులను పరిశీలిస్తే.. అర్వింద్ ధర్మపురి (బీజేపీ), బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్), జీవన్‌రెడ్డి తాటిపర్తి (కాంగ్రెస్), పుప్పాల లింబాద్రి (బీఎస్పీ), అబ్బగోని అశోక్ గౌడ్ (బహుజన లెఫ్ట్ పార్టీ), అలీ మన్సూర్ (అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ), కండెల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గుయ్యసాయి కృష్ణమూర్తి (యుగ తులసి పార్టీ), గోలి నరేష్ (దళిత బహుజన పార్టీ), దేవతి శ్రీనివాస్ (బహుజన ముక్తి పార్టీ), భూక్యా నందు (విద్యార్థుల రాజకీయ పార్టీ), మొగిలి రాజ్‌కుమార్ (ఇండియా ప్రజాబంధు పార్టీ), యోగేందర్ గట్ల (అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా ఆరె రాజేందర్, కొత్తకొండ శక్తిప్రసాద్, కోటగిరి శ్రీనివాస్, గంట చరితారావు, గోపి చంద్రయ్య, టుటుకూరు జీవన్ రెడ్డి, దేశబోయిన లక్ష్మీనారాయణ, బీబీ నాయక్, పాలమూరు సాయి నిఖిల్, ప్రశాంత్ కత్రాజి, మాలావత్ విఠల్, రాగి అనిల్, రాపల్లి సత్యనారాయణ, రాపెల్లి శ్రీనివాస్, వేముల విక్రమ్ రెడ్డి, సయ్యద్ అస్గర్.



అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు..

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్‌వజ్ ఆర్ సమక్షంలో ఈసీ మార్గదర్శకాలను అనుసరిస్తూ అభ్యర్థుల పేర్లు, అధికార తెలుగు భాష వర్ణమాల ప్రకారంగా క్రమసంఖ్య, గుర్తులు కేటాయించారు. ఈ సందర్భంగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారి హనుమంతు సమావేశం అయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియల్లో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్డీవో రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలను రోహింగ్యాలకు అడ్డాగా మార్చారు

- కార్నర్ మీటింగ్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

రాయికల్(జగిత్యాలరూరల్): జగిత్యాలను రోహింగ్యాలకు అడ్డాగా మార్చారని, 40ఏళ్లలో జగిత్యాలకు జీవన్‌రెడ్డి ఏం చేశారో తెలపాలని బీజేపీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. జీవన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అని, ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు షుగర్ ఫ్యాక్టరీని తెరుస్తామంటున్నారని విమర్శించారు. జగిత్యాలను రోహింగ్యాలకు అడ్డాగా మార్చారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫాం సివిల్ కోడ్‌కు మద్దతు పలకలేదన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రం ఐఎస్ఐ వంటి నిషేధిత సంస్థలకు అడ్డాగా మారడానికి కాంగ్రెస్ నాయకులే కారణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో బీజేపీలో చేరేందుకు తొంగిచూస్తున్నాడని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల తిరుపతి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ రాజనాల మధు, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే లవ్ జిహాదీ

సారంగాపూర్: ప్రధాని మోదీ పాలనలో పదేళ్లలో దేశంలో ఎక్కడా టెర్రరిస్టుల దాడులు లేవని, బాంబు బ్లాస్టులు లేవని, దేశ భద్రత పెరిగిందని అర్వింద్ అన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ గెలిస్తే జగిత్యాల లవ్ జిహాదీకి అడ్డాగా మారుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే హిందువుల ఆస్తులు లెక్కించి ముస్లింలకు పంచిపెడుతామని రాహుల్‌గాంధీ అంటున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారయణరావు, ఇండియన్ పీపుల్స్ ఫోరం యూఏఈ అధ్యక్షుడు జితేందర్ వైద్య, జెడ్పీటీసీ పాత పద్మ, పార్టీ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి



వెల్గటూర్: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. సోమవారం మండలం కప్పారావుపేటలో ఉపాధి కూలీలను కలిసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే కూలీలకు రూ.400 వేతనం పెంచుతామన్నారు. రాష్ట్రంలో నాలుగు గ్యారంటీలు అమలు చేశామన్నారు. అనంతరం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ప్రచార బహిరంగ సభాస్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట శైలేందర్‌రెడ్డి, గంద్ర శ్రీకాంత్‌రావు, మంజుల, దావుల శశి, దినేశ్, జీరెడ్డి మహేందర్‌రెడ్డి, పూదరి రమేశ్, గెల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని సమీకృత మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులు కలిసి ఓట్లు అభ్యర్థించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాక్‌లో పాల్గొని క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజు, సీపతి సత్యనారాయణ ఉన్నారు.

కాంగ్రెస్‌కు అండగా ఉండండి

కథలాపూర్(వేములవాడ): బీజేపీ అధికారంలోకొస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రాజ్యాంగం బతకాలంటే ప్రతిఒక్కరూ కాంగ్రెస్‌కు అండగా ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సోమవారం కథలాపూర్ మండలం కలిగోట, ఇప్పపల్లి, అంబారిపేట, పోతారం, తుర్తి గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే చిత్తశుద్ధి ఉందన్నారు. శ్రీరాముడు అందరివాడని, మతాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ ఓట్లు రాబట్టుకోవాలని చూస్తుండటం దారుణమన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒక్కసారైన సూరమ్మ ప్రాజెక్టు కోసం పోరాటం చేశారా అని ప్రశ్నించారు.

రిజర్వేషన్లపై బీజేపీ మాట మార్చడం తగదు



మెట్‌పల్లి: తాము రిజర్వేషన్లకు వ్యతిరేకమని గతంలో చెప్పిన బీజేపీ.. ఇప్పుడు మాట మార్చడం తగదని మాజీ ఎంపీ మధుయాష్కీ పేర్కొన్నారు. మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి బీజేపీ కుట్ర చేస్తోందని, ఇందులో భాగంగానే సీఎంతోపాటు పార్టీ నాయకులకు పోలీసులతో నోటీసులు ఇప్పించిందని విమర్శించారు. అహంకారంతో వ్యవహరిస్తున్న ఎంపీ అర్వింద్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు విశ్వాసం ఉందని, నిజామాబాద్‌లో జీవన్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని తెలిపారు. మే ఒకటిన కోరుట్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఉంటుందని, దీనికి ప్రజలు భారీగా తరలి రావా లని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగా రెడ్డి, నాయకులు జీఎస్.వెంకట్, జెట్టి లింగం, కొమొరెడ్డి లింగారెడ్డి, షేక్ మహమ్మద్ తదితరులున్నారు.

ఎండలో వెళ్తున్నారా.. జాగ్రత్త

- అప్రమత్తంగా ఉంటేనే మేలు
- వడదెబ్బతో ప్రాణాలకే ముప్పు
- డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్



జగిత్యాల: జిల్లాలో 44 డిగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు రోజురోజుకూ మండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో బయటకు వెళ్తే వడదెబ్బ తగలడం ఖాయం. జాగ్రత్తలు పాటించకుండా ఎండలో తిరిగితే శరీర ఉష్ణోగ్రతలు అదుపు తప్పుతాయి. దానిని నియంత్రించే వ్యవస్థ బలహీనపడి వడదెబ్బకు గురవుతారు. ఈ నేపథ్యంలో ఎండలో వెళ్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? ఎండదెబ్బ తగలకుండా చూసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్ పలు అంశాలు వెల్లడించారు. ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: ఎండలో వెళ్లేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో వేడిని నియంత్రించే వ్యవస్థ విఫలమవుతుంది. ఎండకు వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళ్తే గొడుగు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. టోపీ, తలపాగానైనా తప్పకుండా ధరించాలి.

సాక్షి: వడదెబ్బకు గురైతే ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. కొబ్బరినీరు, గ్లూకోజ్, సల్ల, ఓఆర్ఎస్ నీటిని తాగించాలి. ఫ్యాన్ గాలి బాగా తగిలేలా చూడాలి. దుస్తులను వదులుగా చేసి తడిగుడ్డతో ఒళ్లంతా తుడవాలి. మనిషికి తగినంత గాలి ఆడేలా చేయాలి. చుట్టూరా మంది గుమిగూడకూడదు. ఉప్పు కలిపిన ద్రవాలు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. కీరదోస ముక్కలు ఎక్కువగా తినిపించాలి.

సాక్షి: వడదెబ్బకు ఎలా గురవుతారు.. లక్షణాలేంటి..?

డీఎంహెచ్‌వో: తీవ్రమైన వడగాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది. వడదెబ్బకు గురైన వ్యక్తి నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిని కోల్పోవడం, తీవ్రమైన తలనొప్పితో అపస్మారక స్థితిలోకి చేరుకుంటారు.

సాక్షి: వడదెబ్బకు గురైన వ్యక్తిలో కలిగే మార్పులేంటి.. ఆ సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: వేడికి శరీరం ఎక్కువసేపు గురికావడం వల్ల సోడియంక్లోరైడ్, నీటి నిష్పత్తి తగ్గిపోతుంది. అధిక ఉష్ణోగ్రతలు ఉన్న ప్రదేశాల్లో పనిచేసినప్పుడు ప్రతి గంటకు 3 నుంచి 4 లీటర్ల నీటిని చెమట రూపంలో కోల్పోతుంటారు. ఇలాంటి సమయంలో నీరు బాగా తీసుకోవాలి.

సాక్షి: వడదెబ్బ ప్రమాదకరమేనా? అత్యవసర సమయంలో వెళ్లాల్సి వస్తే ఎలా?

డీఎంహెచ్‌వో: వడదెబ్బ చాలా ప్రమాదకరం. మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం హైపోథలామస్ దెబ్బతిని వడదెబ్బకు గురవుతారు. దీనినే సన్‌స్ట్రోక్, హీట్‌స్ట్రోక్ అంటారు. బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ పడకుండా చూసుకోవాలి. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయట తిరగకూడదు.

సాక్షి: ప్రథమ చికిత్స ఏంటి? ఎలా ఇవ్వాలి?

డీఎంహెచ్‌వో: వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకోవాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లను తాగించడంతో పాటు చల్లని ప్రాంతంలో పడుకోబెట్టాలి. ముఖ్యంగా 65ఏళ్లు పైబడిన వారు బయటకు వెళ్లరాదు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంట్లోనే ఉండాలి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పసిపిల్లలు, ఏదైనా అనారోగ్య సమస్యలున్నవారు, ముఖ్యంగా గుండెజబ్బులు, బీపీ ఉన్న వారు వెళ్లవద్దు.

సాక్షి: వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో: ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువ సమయం చల్లని ప్రదేశాల్లో ఉండాలి. అంతేకాకుండా ప్రతి ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బకు సంబంధించిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఆస్పత్రికి వెళ్తే చికిత్స అందిస్తారు. తీవ్రత ఎక్కువగా ఉంటే పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

సాక్షి: ఎండలో వెళ్లాల్సి వస్తే ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: ముఖ్యంగా ఎండకాలంలో వేడి కలిగించే పదార్థాలు తినకూడదు. కూల్‌డ్రింక్స్ అసలే తాగొద్దు. కూల్‌డ్రింక్స్ ప్రమాదకరం. మజ్జిగ, కొబ్బరినీరు మాత్రమే తీసుకోవాలి. వీలైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగాలి. జీలకర్ర దోరగా వేయించి పొడిగా చేసి అరస్పూన్ పొడిని గ్లాస్ నిమ్మరసంలో కలిపి ఉప్పు, చక్కెర వేసుకుని తాగితే ఎనర్జీగా ఉంటుంది.

అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్: అబద్ధపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిందని, ప్రజలు గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని ఓటు వేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలం తుంగూర్, బీర్‌పూర్‌లో ప్రచారం చేశారు. ఉపాధి కూలీలను కలిసి వారి మద్దతు కోరారు. నర్సింహులపల్లెలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చిందన్నారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.7,500 ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడగానే రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడు ఆగస్టులో అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్షతోపాటు, తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇస్తామని, పింఛన్ రూ.4వేలకు పెంచుతామని చెప్పి మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఐదు నెల కాంగ్రెస్ తీరును ప్రజలు గమనించాలన్నారు. పార్టీ ఇన్‌చార్జి లోక బాపురెడ్డి, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, పార్టీ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై చేతులెత్తేసిన సర్కారు



లక్ష్మీపూర్‌లో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: ఆరు గ్యారంటీలను అమలు చేయలేక కాంగ్రెస్‌ప్రభుత్వం చేతులెత్తేసిందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్, లక్ష్మీపూర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఉపాధిహామీ కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమానికి కేసీఆర్ నిరంతరం పనిచేశారని, నిరుపేదలు, రైతులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశా రు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సునీత, నాయకులు చెరుకు జాన్, సత్యంరెడ్డి, రాజిరెడ్డి, సతీశ్, తిరుపతి ఉన్నారు.

ఆహారం కల్తీమయం..!

'జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో కిరణ్ అనే వ్యక్తి అతడి స్నేహితులతో కలిసి భోజనం చేసేందుకు వెళ్లాడు. చికెన్ మెజిస్ట్రిక్స్‌తో పాటు కర్డ్‌రైస్, వెజ్ బిర్యానీకి ఆర్డర్ ఇచ్చారు. తినే సమయంలో దుర్వాసన రావడంతో పాటు ఆరోజు రాత్రి వాంతులతో పాటు తీవ్ర జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లగా, ఫుడ్ పాయిజన్ అయినట్లు వైద్యులు తెలిపారు'.

- పదార్థాల పరిశుభ్రత గాలికి
- ప్రమాదంలో ప్రజారోగ్యం
- ఇష్టారీతిన విక్రయాలు
- పురుగులు పట్టిన బియ్యం, పప్పులు



ఇటీవల బైపాస్‌రోడ్‌లోని ఓ రెస్టారెంట్‌లో స్టోర్ రూమ్‌ను సీజ్ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

జగిత్యాల: జిల్లాలో హోటల్స్, టిఫిన్ సెంటర్లు, స్వీట్‌హౌస్‌లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లాలో సుమారు 500 హోటల్స్, టిఫిన్ సెంటర్లు, 20 రెస్టారెంట్లు, 10 వరకు దాబాలు ఉంటాయి. భారీ సంఖ్యలో టీస్టాల్స్ ఉండగా, పలు చోట్ల నిబంధనలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. వివిధ అవసరాల కోసం పట్టణాలకు వచ్చేవారు భోజనం కోసం హోటల్స్, టీ కోసం టీస్టాల్స్‌ను ఆశ్రయిస్తుంటారు. దీంతో అల్పాహారం, భోజనం చేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్వాహకులు నిబంధనలను విస్మరిస్తున్నా..అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హోటల్స్‌లో ఇలా..

హోటళ్లలో వంటపాత్రలు కడిగేందుకు ప్రత్యేక చాంబర్లు ఉండాలి. కానీ అవి ఎక్కడా కన్పించవు. చాలా హోటల్స్, రెస్టారెంట్లలో పాత్రలు, గ్లాస్‌లను తూతూమంత్రంగా కడిగి మళ్లీ వాటినే వినియోగదారులకు ఉపయోగిస్తారు. వంటమాస్టర్లు, సర్వర్లు ఆప్రాన్స్, క్యాప్, చేతులకు గ్లౌస్‌లు ధరించాలి. కానీ అవి మచ్చుకు సైతం కన్పించవు. కొన్ని సందర్భాల్లో ఆహారంలో వెంట్రుకలు సైతం కన్పిస్తుంటాయి. మాంసం, చట్నీ వంటివి ఫ్రిజ్‌లో కొన్ని రోజులు పాటు నిల్వ ఉంచి దుర్వాసన వచ్చినా వాటిని నూనెలో ఫ్రై చేసి ప్రజలకు అంటగడుతున్నారు. నాసిరకం, బాగా మరిగిన నూనెను మళ్లీమళ్లీ వాడరాదని వైద్యులు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఇంత జరుగుతున్నా ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేసిన పాపాన పోలేదు. ఎప్పుడో ఒకసారి తూతూమంత్రంగా దాడులు చేసి చిన్నపాటి కేసులు బుక్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మత్తులో తిన్పిస్తున్నారు:

జగిత్యాల జిల్లా కేంద్రం కావడంతో ఇటీవలే అభివృద్ధి చెందుతోంది. జనాభా కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. ఆహార అవసరాలను తీర్చేందుకు కొత్తకొత్త హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, స్వీట్‌హౌస్‌లు, ఫుడ్‌కోర్టులు, రకరకాల వ్యాపారాలు వస్తున్నాయి. కొత్తకొత్త ఆహారాన్ని ప్రజలకు అంటగడుతున్నారు. ముఖ్యంగా చైనీస్, ఇరానీ వంటకాల విక్రయాలు ఊపందుకుంటున్నాయి. కాగా పలు రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన ఆహారం విక్రయిస్తూ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నారు. గతంలో జగిత్యాలలో పలు హోటళ్లపై అధికారులు దాడి చేయగా ఫ్రిజ్‌లో కుళ్లిన చికెన్, మటన్ లభ్యమయ్యాయి. ఇటీవల తనిఖీల్లో బైపాస్‌రోడ్‌లోని ఓ రెస్టారెంట్‌లో పురుగులు పట్టిన బియ్యం, కాలంచెల్లిన వస్తువులు దొరికాయి.

నాణ్యమైన ఆహారం అందించాలి



ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి. వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలి. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. – అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

ఫిర్యాదు చేస్తే చర్యలు

ఆహార పదార్థాల కల్తీపై ఎవరు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటాం. హోటల్స్‌పై దాడులు కొనసాగిస్తున్నాం. పలు హోటళ్లపై కేసులు నమోదు చేశాం. – అనూష, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

క్లుప్తంగా

ఎన్టీపీసీ పీటీఎస్‌లో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న చెట్లు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ బి-గేట్ ప్రాంతంలోని చెట్లపొదల్లో సోమవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఎన్టీపీసీకి చెందిన అగ్నిమాపక యంత్రంపాటు మరో మూడు ఫైరింజన్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. కాగా, ఎండిపోయిన చెట్ల ఆకులకు మంటలు అంటుకోవడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ వైర్లకు తగిలి వ్యాన్ దగ్ధం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం డీసీఎం వ్యాన్ గడ్డి కట్టల లోడ్‌తో వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి దగ్ధమైంది. వివరాలు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవి అనే వ్యక్తి డీసీఎం వ్యాన్‌ను బ్రాహ్మణపల్లిలో గడ్డి కట్టలు తీసుకెళ్లేందుకు తీసుకొచ్చారు. దాదాపు 160పైగా గడ్డి కట్టలు వేసుకొని వెళ్తుండగా గ్రామ శివారులో విద్యుత్ వైర్లకు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు వ్యాన్ మొత్తం వ్యాప్తిచెందడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చి ఆర్పివేశారు. డీసీఎం వ్యాన్ పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి ఘటనలో 15 గొర్రెలు చనిపోయాయి. పోతుగల్‌కు చెందిన కుంట్ల భాస్కర్ గొర్రెలమందపై ఆదివారం రాత్రి కుక్కల దాడి చేశాయి. ఈ దాడిలె 15 గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశాడు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతోనే కుక్కలు గొర్లమందలపై దాడులు చేస్తున్నాయన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గౌతంరావు, కాంగ్రెస్ నాయకుడు తోట ధర్మేందర్ కోరారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరాజు భారతి (51) గుండెపోటుతో మృతి చెందారు. మెట్‌పల్లిలో నివాసం ఉంటున్న భారతి సోమవారం ఉదయం ఇంటి పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. భారతి మృతిపట్ల పంచాయతీ అధికారులు సంతాపం తెలిపారు.

పైసల 'పంచాయితీ'



'ఈ ఫొటోలోని వ్యక్తి పేరు మేడి అంజయ్య. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి మాజీ సర్పంచ్. గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా అందినకాడల్లా అప్పు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేయించారు. చేసిన పనులకు ఏడాది కాలంగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పాటు అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. చివరకు బిల్లులు చెల్లించాలని మార్చి 5న తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేయగా పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.. ఇలా అంజయ్య ఒక్కరే కాదు.. గత ప్రభుత్వ హయాంలో అప్పు చేసి, పల్లె ప్రగతి పనులు చేపట్టి.. బిల్లుల కోసం ఎదురుచూస్తున్న మాజీ సర్పంచ్‌లు అందరిదీ ఇదే పరిస్థితి'..

- గుదిబండలా మారిన అప్పులు
- మాజీ సర్పంచ్‌లకు తిప్పలు
- మూడు నెలలు గడుస్తున్నా పత్తాలేని బిల్లులు

కరీంనగర్: గత ప్రభుత్వం పల్లె ప్రగతి పనుల్లో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులను విరివిరిగా చేపట్టింది. ప్రత్యేకాధికారులను నియమించి పల్లెప్రగతి పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని



వెలిచాల గ్రామపంచాయతీ కార్యాలయం

లేకుంటే నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌లపై సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించడంతో.. అప్పటి సర్పంచ్‌లు అప్పు తెచ్చి గ్రామాల్లో వారి పదవీకాలం ఏడాది ముందు ముగుస్తుందనగా పనులు చేపట్టారు. వారి పదవీకాలం ముగిసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు చేతికి రాకపోవడంతో మాజీ సర్పంచ్‌ల అప్పుల తిప్పలు అన్ని ఇన్ని కావు.

313 గ్రామాల్లో పనులు

- జిల్లాలో 313 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రగతి పనుల్లో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనుల బిల్లులు అందక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రాక సతమతమవుతున్నారు.
- ఉపాధి పథకంలో రూ.22 లక్షలతో ఒక్కో రైతు వేదిక, రూ.12లక్షల చొప్పున వైకుంఠధామం, రూ.లక్ష నుంచి రూ.4 లక్షలతో క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనంతో పాటు గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా రూ.28.70 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- కార్యక్రమాల అమలులో లక్ష్య సాధనకు సర్పంచులు, కాంట్రాక్టర్లపై జిల్లా అధికారులు ఒత్తిడి తెచ్చి గడువులోగా పనులు పూర్తి చేయించారు. కానీ చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు అందక అరిగోస పడుతున్నామని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో చేపట్టిన పనులు..

పల్లె ప్రకృతి వనాలు	313
రైతు వేదికలు	76
క్రీడా ప్రాంగణాలు	313
వైకుంఠధామాలు	313
సీసీ రోడ్లు	573
డంప్‌యార్డులు	340
వర్మి కంపోస్టు షెడ్లు	267
నర్సరీలు	313
వరి కల్లాలు	2,666

- లక్షల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని, బిల్లులు పూర్తిగా చెల్లించలేదని వాపోతున్నారు. పల్లె ప్రగతిలో చేపట్టిన పనుల బిల్లులన్నింటినీ చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.
- మరోవైపు పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు అందక విద్యుద్దీపాలు, ట్రాక్టర్ల వాయిదాలు, కరెంటు బిల్లులు, తాగునీరు, బోరు మోటార్ల నిర్వహణ ఎలా చేసేదని ప్రస్తుత కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుడు 183.. ఇప్పుడు 29

- గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎర్రజొన్న రైతుల హవా
- అందరి దృష్టిని ఆకర్షించిన అప్పటి నిజామాబాద్ ఎన్నిక

కోరుట్ల: 2019 నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలు.. 'పది..పాతిక' కాదు..ఏకంగా 183 మంది నామినేషన్లు వేశారు. అప్పటికీ కొంత మంది రైతులు నామినేషన్లు వేయకుండా అప్పటి అధికార పార్టీ ప్రయత్నం ఫలితంగా నామినేషన్ల జోరుకు కాస్త అడ్డుకట్ట పడింది. అప్పుడు నిజామాబాద్ పార్లమెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. ధర గిట్టుబాటు కావడం లేదని పసుపు, ఎర్రజొన్న, చెరుకు పెద్ద సంఖ్యలో తాము పోటీకి ముందుకు వచ్చారు. చివరికి 183 మంది నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ సారి నిజామాబాద్ పార్లమెంట్‌లో పరిస్థితి మారింది. ఉపసంహరణల పర్వం ముగిసేసరిగి మొత్తం 29 మంది అభ్యర్థులు మాత్రమే బరిలో మిగిలారు.

ముకుమ్మడి జాడ లేదు

గత ఎన్నికల్లో అత్యధికంగా నామినేషన్లు దాఖలైన క్రమంలో ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనని పోలీస్, ఇంటలిజెన్స్ వర్గాలు ముందుగానే ఆరా తీశాయి. ఎన్నికల అధికార యంత్రాంగం నామినేషన్ల తీరుపై కొంతమేర దృష్టి సారించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్, కోరుట్ల, జగిత్యాల, బాల్కొండ, బోధన్ పరిసర ప్రాంతాల్లోని పసుపు, ఎర్రజొన్న, చెరుకు రైతులు ఉద్యమస్ఫూర్తితో ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. అప్పుడు క్వింటాలు పసుపు ధర కేవలం రూ.5వేల నుంచి రూ.7వేల మాత్రమే ఉండటం, ఎర్రజొన్నకు ఆశించిన రీతిలో ధర లేకపోవడం, పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల, బోధన్ సెగ్మెంట్ల పరిధిలోని ముత్యంపేట, బోధన్ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలన్న డిమాండ్‌తో రైతులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేసి తమ సమస్యలను దేశవ్యాప్తంగా



2019 ఎన్నికల్లో ఈవీఎంలు (ఫైల్)

ఎత్తిచూపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సారి పసుపు బోర్డు ప్రకటనతో పాటు పసుపు ధర క్వింటాలు రూ.9వేల నుంచి రూ.16వేల వరకు పలకడంతో రైతులకు ఉపశమనం దక్కింది. ముత్యంపేట, బోధన్ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ అధ్యయన కమిటీ వేయడం చెరుకు రైతులకు ఊరటనిచ్చింది. ఫలితంగా రైతులు ఈ సారి ముకుమ్మడి నామినేషన్లపై పెద్దగా ఆసక్తి చూపలేదు.

ఫలితంపై ప్రభావం..

గత ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా 183 మంది అభ్యర్థులు బరిలో ఉండటం.. వీరిలో 175 మందికిపైగా రైతులు కావడం గమనార్హం. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసి బరిలో నిలిచిన సుమారు 175 మంది రైతులకు సుమారు 80 వేలపైనే ఓట్లు పోలయ్యాయి. ఆ ఎన్నికల్లో బీజేపి తరఫున బరిలో నిలిచిన ఎంపీ అర్వింద్ 4,80,484 ఓట్లు సాధించగా, బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత 4,09,709 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి మధుయాస్కి 69,240 ఓట్లు పొందారు. కేవలం 70 వేల ఓట్ల తేడాతో కల్వకుంట్ల కవిత ఓటమి పాలయ్యారు. రైతులకు వచ్చిన ఓట్లు దాదాపు ఇదే సంఖ్యలో ఉండటంతో రైతుల నామినేషన్లు ఎన్నికల ఫలితాలనే తారుమారు చేశాయన్న ప్రచారం జరిగింది. ఈ సారి ఎన్నికల బరిలో కేవలం 29 మంది మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తేలికగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

రూ.4లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని పాతబస్టాండ్ ఆవరణలో సోమవారం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ.ఇక్రమొద్దీన్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.4లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా.. విద్యానగర్‌కు చెందిన గొడిసెల్లి సురేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.85 వేల నగదును సీజ్ చేశారు.

రైలుకిందపడి లారీ డ్రైవర్ ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్ జహీరొద్దీన్(55) సోమవారం పెద్దపల్లి- రాఘవాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని రైల్వేహెడ్ కానిస్టేబుల్ కెంసారపు సంపత్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని వివరించారు.

కాంగ్రెస్ అభ్యర్థిపై చర్య తీసుకోండి

- రిటర్నింగ్ అధికారి, పోలీసులకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై చర్య తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతితోపాటు ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. రాజేందర్‌రావు తన సొంత ఫేస్‌బుక్ ఐడీ నుంచి రిజర్వేషన్ల రద్దు, బండి సంజయ్ మోసాలు అంటూ ఆయన మాటలను వక్రీకరించి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అవసరమైతే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తోపాటు డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కొట్టె మురళీకృష్ణ, డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, సొల్లు అజయ్ వర్మ, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడు పొన్న వెంకటరమణ తదితరులున్నారు.

తండ్రిపై కొడుకు దాడి


- ఆస్తి తగాదాలే కారణం

మల్లాపూర్: ఆస్తి తగాదాలతో కన్న తండ్రిపై ఓ కొడుకు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని రేగుంటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూడంపెల్లి రాజరెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శేఖర్ కొద్దిరోజులుగా తండ్రితో తగాదా పెట్టుకుంటున్నాడు. సోమవారం కూడా గొడవకు దిగిన శేఖర్ గడ్డపారతో తండ్రిపై దాడి చేశాడు. ఈ ఘటనలో రాజరెడ్డి తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు రేగుంటకు వెళ్లి విచారణ చేపట్టారు.

ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్

- రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- దుబాయి నుంచి డీజీపీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

జగిత్యాల క్రైం: నాన్ బెయిలబుల్ వారెంట్ అందించిన కానిస్టేబుల్.. రూ.10 వేలు లంచం కావాలని డిమాండ్ చేసి.. రూ.5వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఈ సంఘటన జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. మనోహర్ కొద్దికాలంగా జిల్లాకేంద్రంలో నాన్ బెయిలెబుల్ వారెంట్లు జారీ చేస్తున్న విభాగంలో పనిచేస్తున్నాడు. జగిత్యాల అర్బన్ మండలం పెరకపల్లి గ్రామానికి చెందిన బాలె తిరుపతి ఓ కేసులో కోర్టు హాజరుకాకుండా దుబాయ్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో కోర్టు వారెంటును కొద్దిరోజుల క్రితం హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ వారి కుటుంబసభ్యులకు అందించి లంచం డిమాండ్ చేస్తున్నాడు. వాస్తవానికి కోర్టు పంపించే వారెంట్లను కుటుంబసభ్యులకు అందించాలి తప్ప ఎలాంటి డబ్బులూ డిమాండ్ చేయరాదు. మనోహర్



పట్టుబడిన హెడ్‌కానిస్టేబుల్ మనోహర్

మాత్రం లంచం కోసం వేధిస్తుండడంతో దుబాయ్‌లో ఉన్న తిరుపతి ఈనెల 16న రూ.5వేలు ఫోన్‌పే ద్వారా మనోహర్‌కు పంపాడు. అయినా మనోహర్ వినిపించుకోకుండా మరో రూ.5 వేల కోసం డిమాండ్ చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో తిరుపతి డీజీపీకి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కృష్ణకుమార్, తిరుపతి జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద బాధితుడి తిరుపతి మామ కటుకం గంగాధర్‌కు రూ.5వేలు ఇచ్చి పంపించారు. వాటిని గంగాధర్ నుంచి తీసుకుంటుండగా మనోహర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు వెల్లడించారు.

ప్రాణం తీసిన బండరాయి

- ట్రాక్టర్‌పై నుంచి పడి మాజీ సర్పంచ్ మృతి
- చందుర్తిలో విషాదం



మల్లేశం(ఫైల్)

చందుర్తి(వేములవాడ): రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల పక్కన ఏర్పాటు చేసిన బండరాయి ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలకేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం(52) ఆదివారం రాత్రి పొలం వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల పక్కనే ఉన్న బండరాయిని గమనించక ట్రాక్టర్‌ను ఎక్కించాడు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో మల్లేశం తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమం, స్వధార్ హోమ్, బాల సదన్, శిశుగృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ సందర్శించారు. స్వధార్ హోమ్‌లో ఉన్నవారితో మాట్లాడారు. యవ్వనంలో ఆకర్షణకు లోనై, బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. కష్టపడి చదువుకొని, జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాతే ప్రేమ గురించి ఆలోచించాలని సూచించారు. బాలసదన్‌లోని పిల్లలతో మాట్లాడుతూ.. పరిశుభ్రత పాటించాలని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. శిశుగృహలో వంట, ఆహార పదార్థాలను నిల్వ చేసే గదులను తనిఖీ చేశారు. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి న్యాయపరమైన సహాయం కావాలన్నా సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వద్ధాశ్రమం, స్వధార్ హోం, బాల సేదన్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నేచర్' అండ.. దాతల సాయం



దాతల నుంచి సేకరించిన నగదును బాధితులకు అందజేస్తున్న నేచర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు

- బాధిత కుటుంబానికి రూ.4,04,260 అందజేత

రామడుగు(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడడంతో వారి ఆర్థిక పరిస్థితి దీన స్థితికి చేరింది. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన యూత్ అసోసియేషన్ సభ్యులు బాధితుల ఇబ్బందులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో దాతలు స్పందించి వారి వైద్య ఖర్చులకు అవసరమైన కొంత నగదును అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాలు.. రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏగోలపు మల్లేశం, భారతమ్మ ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గోపాల్‌రావుపేట శివారులో లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. వారిది గీత కార్మిక పేద కుటుంబం. వైద్యానికి డబ్బు లేక ఇబ్బందిపడుతున్న పరిస్థితి తెలుసుకొని గ్రామానికి చెందిన నేచర్ యూత్ అసోషియేషన్ సభ్యులు వారి దీనగాథను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈక్రమంలో గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల దాతలు స్పందించి రూ.4,04,260 ఆర్థికసాయం అందించగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కరుణశ్రీపాపిరెడ్డి, నేచర్ యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసారపు పర్శారాంగౌడ్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, గడ్డం రత్నాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేహదానానికి దంపతుల అంగీకారం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో పెళ్లినరోజు సందర్భంగా ఓ యువజంట ఆదర్శనీయ నిర్ణయం తీసుకుంది. మరణానంతరం తమ దేహాలను మెడికల్ కాలేజీకి దానం చేస్తామని ప్రకటించారు. రమేశ్‌నగర్‌కు చెందిన కట్కూరి రాజశేఖర్-శ్రీచందన దంపతులు. స్థానిక లక్ష్మీనగర్‌లో రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. సోమవారం పెళ్లిరోజు సందర్భంగా వినూత్నంగా వేడుకలు జరుపుకున్నారు. మరణానంతరం తమ దేహాలను రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి దానం చేస్తామని ప్రకటించారు. అంగీకార పత్రాలపై సంతకాలు చేసి సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరెపెల్లి రాజమౌళికి అందజేశారు. రాజమౌళి వారిని అభినందించారు. అనంతరం దంపతులకు సదాశయ ఫౌండేషన్ ద్వారా అభినందన పత్రాన్ని అందజేశారు.



అభినందనపత్రం అందిస్తున్న రాజమౌళి

ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి కేఎస్‌వాసు తదితరులు పాల్గొన్నారు. దంపతులను ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్, కార్యదర్శి టి.లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి భీష్మాచారి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు నూక రమేశ్ తదితరులు అభినందించారు.

200 కేజీల నల్లబెల్లం స్వాధీనం

రామగుండం: అండమాన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం రాత్రి తనిఖీలు చేయగా 200 కేజీల నల్లబెల్లం లభ్యమైందని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వరంగల్ నుంచి రామగుండం చేరుకున్న రైలులో సోదా చేయగా సంచుల్లో నల్లబెల్లం లభించిందన్నారు. దీనిని స్వా. దీనం చేసుకొని సోమవారం కేసు నమోదు చేసి ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్‌కు అప్పగించామని పేర్కొన్నారు. బెల్లం విలువ సుమారు రూ.80వేలు ఉంటుందన్నారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌పీఎఫ్ సతార్క్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రూ.4.20 లక్షల విలువైన నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నల్లబెల్లం రవాణాను గుర్తించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది లోకేంద్ర, ఓంవీర్, దినేశ్ చంద్‌ను సీఐ అభినందించారు.

తప్పుడు పత్రాలతో భూకబ్జాకు యత్నం

- ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు

చొప్పదండి: తప్పుడు ధ్రువపత్రాలు తయారు చేసి ఇతరులకు విక్రయించిన భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి పట్టణానికి చెందిన సుద్దాల వెంకటస్వామి 2010లో పెద్దెళ్ళి గట్టయ్య వద్ద 2 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అనంతరం 2016లో రామడుగుకు చెందిన వైద్యుల మహేందర్‌రెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈక్రమంలో పలువురి చేతులు మారిన తర్వాత చొప్పదండి మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి కొనుగోలు చేసి మోకాపైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, సుద్దాల వెంకటస్వామి అడ్డుకున్నాడు. ఎవరైనా మోకాపై వెళ్లేందుకు ప్రయత్నించగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు పెడుతానని బెదిరించాడు. వెంకటస్వామి అమ్మిన 2 గుంటలు, దాని పక్కనే ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 442లోని మరో 2 గుంటలు కబ్జా చేసి తన భార్య సుద్దాల తరుణి పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించాడు. 2007లో తన భార్య పేరు మీద గ్రామపంచాయతీ రికార్డులో ఎటువంటి గృహ నిర్మాణం చేయకుండా తప్పుడు పత్రాలతో దొంగ ఇంటి నంబర్ పొంది కబ్జా చేశాడు. మోకాపైకి కొనుగోలుదారు వెళ్లకుండా భయభ్రాంతులకు గురి చేసి అమ్మిన భూమితో పాటు, మరో 2 గుంటలు కబ్జా చేయాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ రికార్డులను ఫోర్జరీ చేశాడు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పలువురికి డబుల్ రిజిస్ట్రేషన్‌లు చేసి అట్రాసిటీ కేసులు పెడుతానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని వల్లాల కృష్ణహరి ఫిర్యాదు మేరకు వెంకటస్వామి, అతడి భార్య తరుణిలపై కేసు నమోదైంది. విచారణలో ఆరోపణలు నిజం కావడంతో సోమవారం వెంకటస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

తెరపైకి డబుల్ రిజిస్ట్రేషన్‌ల దందా

చొప్పదండి పట్టణంలో పలువురు దళారుల అవతారం ఎత్తి దశాబ్దకాలంగా డబుల్ రిజిస్ట్రేషన్‌ల దందా నిర్వహిస్తున్నారు. ఇంటి నిర్మాణాలు చేయకుండానే నంబర్లు వేయించుకోవడం, అక్రమంగా విద్యుత్ మీటర్లు పొంది భూములు కబ్జా చేయడం వంటి దందాలో పలువురు ఆరి తేరారు. బ్రాహ్మణకుంట సమీపంలోని 301 సర్వే నంబర్‌లో ఒకే వ్యక్తి 32 గుంటల భూమిని ఒకసారి ఇద్దరికి, రెండోసారి 32 గుంటలను ఒక్కరికి, మూడోసారి రెండు మూడు గుంటల చొప్పున పలువురికి డబుల్, ట్రిపుల్ రిజిస్ట్రేషన్‌లు చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు ఆడిందే ఆటగా మారింది. కాగా డబుల్ పట్టాల వ్యవహారంలో వెంకటస్వామి అరెస్ట్‌తో రోడ్డు పక్కన విలువైన స్థలాలను డబుల్ పట్టా చేసి కబ్జా చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని భూయజమానులు కోరుతున్నారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి బాధ్యతలు చేపట్టిన తర్వాత భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతుండటంతో తమకు న్యాయం జరుగుతుందని ప్లాట్ల యజమానులు ఆశాభావంతో ఉన్నారు. ఇప్పటికే సీపీ వద్ద పలువురు చొప్పదండి వాసులు ఫిర్యాదు చేయడంతో కబ్జాదారుల వెన్నులో వణుకు పుడుతోంది.

ఎనిమిదేళ్లకు కూతురు దరి చేరిన తల్లి

- మతిస్థిమితం లేక.. తప్పిపోయిన తల్లి
- అమ్మ కోసం వెతికి వెతికి.. అలసిపోయిన కూతురు
- ఇల్లంతకుంట పోలీసుల చొరవతో కలిసిన తల్లీకూతుళ్లు

సిరిసిల్ల: ఎనిమిదేళ్ల కిందట తప్పిపోయిన తల్లి.. ఆమె కోసం వెతికి వెతికి ఆశలు చాలించుకున్న కూతురు.. చివరికి ఇల్లంతకుంట పోలీసుల చొరవతో.. తల్లీబిడ్డలు కలిసిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లాలో సోమవారం రాత్రి జరిగింది. ఇల్లంతకుంట ఎస్సై రాజు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో ఒక గుర్తుతెలియని మహిళ ఉందని ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌కు డయల్ 100 కాల్ వచ్చింది. వెంటనే ఇల్లంతకుంట ఎస్సై రాజు బ్లూకోర్ట్ సిబ్బందిని గాలిపల్లికు



ఎనిమిదేళ్లకు కూతురు దరి చేరిన తల్లి రాములమ్మ

పంపించారు. అక్కడ గుర్తుతెలియని మహిళ ఉండడంతో ఆమెను విచారించగా తన పేరు దోమల రాములమ్మ భర్త పుల్లయ్య అని తెలిపింది. ఆమెను సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సఖీ సెంటర్‌కు పంపించారు. రాములమ్మ చెప్పిన వివరాల ఆధారంగా ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కిష్టాపూర్ గ్రామంగా గుర్తించిన పోలీసులు ముదిగొండ పోలీసుల సహకారంతో కిష్టాపూర్ గ్రామ పెద్దలకు రాములమ్మ ఫొటోలను సోమవారం పంపించారు. తన తల్లిగా గుర్తించిన ఆమె కూతురు రమాదేవి ఎనిమిదేళ్ల కిందట మతిస్థిమితం సరిగా లేక తప్పిపోయిందని, ఆమె కోసం అప్పటి నుంచి వెతుకుతున్నామని రమాదేవి పోలీసులకు వివరించారు. ఈమేరకు ముదిగొండ పోలీసుల సహకారంతో ఇల్లంతకుంట పోలీసుల చొరవతో కిష్టాపూర్ నుంచి రమాదేవి సిరిసిల్ల సఖీ కేంద్రానికి వచ్చి తల్లిని చూసి బోరున విలపించింది. ఇల్లంతకుంట ఎస్సై రాజు సమక్షంలో రమాదేవికి ఆమె తల్లి రాములమ్మను అప్పగించారు. ఎనిమిదేళ్ల కిందట తప్పిపోయిన తన తల్లిని గుర్తించి తమకు అప్పగించినందుకు రమాదేవి ఇల్లంతకుంట పోలీసులకు, సఖీ కేంద్రం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.